


13న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-సాలూరు

సాలూరులోని ప్రభుత్వ ఐటిఐలో ఈ నెల 13న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిఐ ప్లేస్‌మెంట్ అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అదాని ఎనర్జీ సొల్యూషన్స్, భగవతి ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, పాటిల్ రైల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా ఎలక్ట్రానిక్స్, హీరో మోటార్ సైకిల్స్, డి మార్ట్, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, తదితర కంపెనీలు జాబ్‌మేళాకు హాజరై, ఎంపికలు చేసుకుంటాయని తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, డిగ్రీ విద్యార్హత ఉండాలని చెప్పారు. ఐటిఐ పాసైన వారిని అప్రెంటిస్ శిక్షణకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గిరిజన సంక్షేమ డిడి మార్పు వెనుక

మతలబు ఏమిటో?

- అవినీతి ఆరోపణలా? పాలనా సామర్థ్యం లేక?
- కొత్త డిడిగా విజయశాంతి నియామకం



పార్వతీపురంలోని టిడిఎ కార్యాలయం

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ మార్పు వెనుక మతలబు ఏమిటనే చర్చ జరుగుతోంది. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆశీస్సులతో గిరిజన సంక్షేమ డిడిగా కృష్ణవేణి సుమారు 8నెలల క్రితం బాధ్యతలు స్వీకరించారు. సాలూరు గిరిజన సంక్షేమ సహాయ అధికారిగా ఉన్న కృష్ణవేణిని పూర్తి అదనపు బాధ్యతలతో డిడిగా నియమించారు. అయితే ఆమె స్థానంలో కొత్త డిప్యూటీ డైరెక్టర్‌గా ఎ.విజయశాంతిని నియమిస్తూ గిరిజన సంక్షేమ డైరెక్టర్ సదా భార్గవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కృష్ణా జిల్లా గిరిజన సంక్షేమ అధికారిగా పనిచేస్తున్న విజయశాంతిని ఇక్కడ పూర్తి అదనపు బాధ్యతలతో డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించారు. ఇంతవరకు డిడిగా ఉన్న కృష్ణవేణిని అనూహ్యంగా మార్చడం వెనుక ఆంతర్యమేమిటనే చర్చ సాగుతోంది. ఆమె పనితీరుపై కొన్ని గిరిజన సంఘాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. గిరిజన సంక్షేమ పాఠశాల్లో ఆమె ఇష్టారాజ్యంగా ముడుపులు తీసుకుని ఉద్యోగోన్నతులు కల్పించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డెప్యుటేషన్లు కూడా చేశారనే వాదనలు ఉన్నాయి. ఈ అంశాలపై అధికారపార్టీ కి చెందిన ఓ ఎమ్మెల్యే కూడా ఆమె తీరుపై అసంతృప్తితో ఉన్నారనే ప్రచారం జరిగింది. గత కొంతకాలంగా కొన్ని గిరిజన సంఘాలు కూడా రెగ్యులర్ డిడిని నియమించాలని డిమాండ్ చేశాయి. వీటితోపాటు కృష్ణవేణి గడిచిన ఎనిమిది నెలల కాలంలో తగిన పరిపాలనా సామర్థ్యం చూపలేకపోయారనే అభిప్రాయం కూడా ఉన్నతాధికారుల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

ఇటీవల కురుపాం గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినుల మృతి చెందడం, 150 మందికి పైగా విద్యార్థినులు అస్వస్థతకు గురికావడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనానికి దారితీసింది. గిరిజన సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి గౌతమి, గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ లాంటి ఉన్నతాధికారులు కురుపాం గురుకుల పాఠశాలని సందర్శించడం, విద్యార్థినులు చికిత్స పొందుతున్న ఆసుపత్రులకు వెళ్లి పరామర్శించడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ వ్యవహారంలోనూ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణవేణి పనితీరుపై ఉన్నతాధికారుల్లో అసంతృప్తి వ్యక్తమైనట్లు తెలిసింది.

మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయనే ధీమాతో ఉన్న డిడి కృష్ణవేణిని అనూహ్యంగా మార్చడం చర్చనీయాంశమవుతోంది. మంత్రి సొంత జిల్లాలో గిరిజన సంక్షేమ డిడి మార్పు విషయం ఆమెకు తెలిసే జరిగిందా? లేదా? అన్నది అంతుచిక్కడం లేదు.

మంత్రిని కలిసేందుకు ప్రయత్నించిన గిరిజన సంఘాలు

గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణవేణిని ఆ పోస్ట్ నుంచి తప్పించిన నేపథ్యంలో కొన్ని గిరిజన సంఘాల నాయకులు శుక్రవారం మంత్రి సంధ్యారాణిని కలిసేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. సాలూరులోని మంత్రి సంధ్యారాణి క్యాంపు కార్యాలయానికి వచ్చిన సంఘాల నాయకులకు ఆమె అపాయింట్‌మెంట్ ఇవ్వలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్‌గా కృష్ణవేణి ని కొనసాగించాలని కోరుతూ గిరిజన సంఘాల నాయకులు మంత్రి సంధ్యారాణిని కలిసేందుకు ప్రయత్నించారని సమాచారం. అయితే ఆమె గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా ఎవరినీ కలవడానికి అవకాశం ఇవ్వలేదని తెలుస్తోంది. శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి కూడా ఆమె హాజరు కాలేదు.

హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు

ఐద్వా జిల్లా మహాసభలో వక్తల పిలుపు



మహాసభలో అభివాదం చేస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురం

మహిళల హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని మల్లు స్వరాజ్యం నగర్ గిరిజన సామాజిక భవనంలో ఐద్వా జిల్లా 9వ మహాసభ ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగింది. ముందుగా ఐద్వా జెండాను పూర్వ అధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి శ్రీదేవి, బి.లక్ష్మి, ఉపాధ్యక్షులు వి.ఇందిర మాట్లాడారు. ఆధునిక సమాజంలో రోజురోజుకీ మహిళలపై హింస పెరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. సోషల్ మీడియాలో విపరీత పోకడల వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వ్యక్తిగత స్వేచ్ఛను హరించే విధంగా సోషల్ మీడియాలో ఒక వర్గం ప్రచార నిర్వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు కూడా మహిళలకు తీవ్ర నష్టం చేకూరుస్తున్నాయని వాపోయారు. పని ప్రదేశాలలో రక్షణ లేకుండా పోతుందని, ఆధునిక సమాజంలో కూడా వరకట్న వేధింపులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఓట్ల కోసం మహిళలను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిస్తున్న రాజకీయ పార్టీలు... మహిళలకు సంపూర్ణ స్వేచ్ఛను ఇచ్చే విధంగా రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమలు చేసే విధంగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సాధికారత సాధనకు కృషి చేయాలన్నారు. ఆర్థికంగా మహిళలు స్వతంత్రంగా జీవనం సాగించే విధానాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఐక్య పోరాటాల ద్వారా మహిళల హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పని ప్రదేశాలలో మహిళలకు రక్షణను కల్పించాలని, మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని, మహిళా సాధికారత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాల రూపొందించాలని మహాసభలో తీర్మానించారు.

మహిళా పోరాటాలకు సంఘీభావం

దేశవ్యాప్తంగా మహిళల హక్కుల సాధనకు చేస్తున్న పోరాటాలకు ఎల్లప్పుడూ మద్దతు ఇస్తామని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మథరావు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి ప్రకటించారు. సామాజిక సమస్యలపై మహిళలు పోరాడాలంటూ సౌహార్ధ సందేశాలు ఇచ్చారు.



అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి శ్రీదేవి, బొత్స లక్ష్మి

నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం ఐద్వా జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా రెడ్డి శ్రీదేవి, కార్యదర్శిగా బొత్స లక్ష్మి, కోశాధికారిగా వి.రామలక్ష్మి, ఉపాధ్యక్షులుగా వి.ఇందిర, ఎం.గౌరీ, సహాయ కార్యదర్శిగా జె.సుందరమ్మతోపాటు ఆరుగురు కమిటీ సభ్యులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

అధిక రాబడి వచ్చే పంటలపై దృష్టి

కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి



సమావేశంలో మాట్లాడుతునఉన కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం

రైతులు అధిక రాబడి వచ్చే పంటలపై దృష్టి సారించాలని కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. పిఎం ధన ధాన్య కృషి యోజన, పప్పు ధాన్యాల ఆత్మ నిర్భరత పథకాలను నేషనల్ అగ్రికల్చరల్ సైన్స్ కాంప్లెక్స్ నుంచి ప్రధాని మోడీ వర్చువల్‌గా శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కేంద్రం నుంచి కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి, ఇతర అధికారులు కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి, అధిక లాభాలు వచ్చిన పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు పండించాలని, పామాయిల్, కొబ్బరి, పూల్ మఖానా, చెస్ నట్స్ వంటి పంటలతో పాటు అంతర్ పంటలు పండించడం వల్ల మరింత ఆదాయం పెరుగుతుందని తెలిపారు. రైతులు చిన్నపాటి మార్పులు చేసుకోవడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని చెప్పారు. వరికి బదులుగా అధిక ఆదాయం వచ్చే పంటలపై దృష్టి సారించాలని, పొలంగట్లపై కందులు, కూరగాయల పంటలను వేసి అదనపు ఆదాయం పొందాలని తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పూల్ మఖాన వంటి పంటలపై వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కువగా అపరాలను సాగుచేయాలని రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ డైరెక్టర్ డి. శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి కె.క్రాంతి కుమార్, జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి శ్రావణ్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : రైతు సంక్షేమం, వ్యవసాయ స్వయం సమృద్ధికి ప్రధాని మోడీ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. పిఎం ధన్, ధాన్య కృషి యోజన, దళహన్ ఆత్మ నిర్భర్ మిషన్ ప్రారంభోత్సవాన్ని శనివారం రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో ఆమె రైతులతో కలిసి వీక్షించారు. వ్యవసాయం, పశుసంవర్ధకం, మత్స్య పరిశ్రమలో వాణిజ్య కార్యకలాపాల ఆధారిత విధానాన్ని అమలు వేయడం వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను కెవికె సమన్వయకర్త ఎస్.ధ్రువ.. రైతులకు వివరించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు శ్రీనివాసరాజు, అనంతవిహారి, అమృతవీణ, స్రవంతి, అను, ఉమాజ్యోతి, నాయకులు డొంకాడ రామకృష్ణ, కృష్ణబాబు, కద్రక మల్లేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న జెసి యశ్వంత్‌కుమార్

ప్రజాశక్తి-కురుపాం,గుమ్మలక్ష్మీపురం

ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల సంబంధిత సంరక్షకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఇటీవల కురుపాం గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం, పలువురు విద్యార్థులు పచ్చకామెర్లు బారిన పడిన నేపథ్యంలో అధికారులు విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఎప్పటికప్పుడు జిల్లా అధికారుల పర్యటన సంతరించుకుంది. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలంలోని రేగిడి, దొరజమ్ము, దుడ్డుఖల్లు, టిక్కబాయి ఆశ్రమ పాఠశాలలను జెసి యశ్వంత్ కుమార్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాబోధన, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులు, పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, తాగునీరు, స్నానపు గదులు , మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లు, ఆవరణను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని, తద్వారా రోగాలు దరిచేరవని అన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని, ప్రోటీన్లు, విటమిన్లు ఉండేలా ఆకు, కూరగాయలు, గుడ్లను ఇవ్వాలని సూచించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని, అనారోగ్యానికి గురైన వెంటనే వైద్య సదుపాయాలు కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం తహశీల్దార్ శేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కౌలురైతులకు తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి-పార్వతీపురం

కౌలురైతులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కౌలురైతుకు కౌలుగుర్తింపు కార్డులు చట్ట ప్రకారం ఇవ్వాల్సి ఉన్నా ఇంతవరకు మూడో వంతుకు కూడా మంజూరు చేయలేదని చెప్పారు. గుర్తింపు కార్డు లేకపోవడంతో కౌలుదారుకు అన్నదాత సుఖీభవ పథకం అమలు కాలేదని చెప్పారు. గుర్తింపు కార్డు లేక సబ్సిడీ ఎరువులు కూడా ఇవ్వలేదని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి, గాలికి పంట నష్టపోయినా కౌలుదారులకు నష్టపరిహారం ఇవ్వడం లేదని చెప్పారు. గుర్తింపు కార్డు లేకపోవడంతో కౌలుదారు పేరున ఇ-క్రాప్ చేయడం లేదని పేర్కొన్నారు. పెట్టుబడి పెట్టి ఆరుకాలం కష్టపడి పంట పండిస్తున్న కౌలుదారు నోట్లో ప్రభుత్వం మట్టి కొడుతోందని విమర్శించారు. ఇప్పటికైనా కౌలుదారులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి, ఇ-క్రాప్ చేసి, పంటరుణాలు, నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో మాదిరిగా భూయజమాని ఆమోదం లేకుండానే కౌలుదార్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జిఎస్‌టి తగ్గింపుతో ప్రజలకు ఆదా

ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జిఎస్‌టి తగ్గింపుతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఏడాదికి రూ.15 వేలు ఆదా అవుతుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో శనివారం జిఎస్‌టి సంస్కరణలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బి.జ్ఞానప్రసునాంబ, జిఎస్‌టిఒ డి.శ్రీనివాస్, ఎఇఒ తిరుపతి, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతమ్మ, పిఎసిఎస్ చైర్మన్ సోమల మాస్టర్, వర్తక సంఘ అధ్యక్షుడు వెంకట్రావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి దొరబాబు, కూటమి నాయకులు సొంటిన రాజేష్, మన్మథ, దాసరి రామారావు పాల్గొన్నారు.



రాములును సైకిల్‌పై ఆస్పత్రికి తీసుకు వస్తున్న కుమారుడు రాజు, బంధువులు

కురుపాంలో

దారుణం

మేకలు పొలంలో దిగాయని కాపరి హత్య

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం మండల కేంద్రంలో దారుణం జరిగింది. పొలంలో మేకలు దిగితే కాపరిని హత్య చేసిన ఘటన శనివారం మండలంలో సంచలనం రేకెత్తించింది. ఎస్ఐ పి.నారాయణరావు కథనం ప్రకారం.. కురుపాం మేజర్ పంచాయతీలో హుకుంపేట గ్రామానికి చెందిన రాయగడ నల్లన్నదొర శనివారం మధ్యాహ్నం తన వరిచేనులోకి మేకలు దిగాయనే కోపంతో కురుపాం మేదరవీధికి చెందిన పిల్లి రాజుతో ఘర్షణ పడ్డాడు. అక్కడే ఉన్న రాజు తండ్రి పిల్లి రాములు (60) ఆపేందుకు ప్రయత్నించాడు. ఇంతలో రాములు తలపై నల్లన్నదొర కర్రతో బలంగా కొట్టాడు. దీంతో రాములు కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా, అందుబాటులో వాహనం లేదు. దీంతో సైకిల్‌పైనే క్షతగాత్రుడిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాములు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



నాగేశ్వరరావు భౌతికకాయం వద్ద నివాలులర్పిస్తున్న శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పువ్వల మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, వైసిపి సీనియర్ నాయకులు పువ్వల నాగేశ్వరరావు (67) మరణించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన.. విశాఖపట్నంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా రెండు పర్యాయాలు ఆయన పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా పనిచేసి, అనంతరం వైసిపిలో తుదిశ్వాస వరకు కొనసాగారు. నాగేశ్వరరావు సతీమణి పువ్వల ఈశ్వరమ్మ.. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. వీరికి కుమారుడు భరత్ శ్రీనివాస్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శనివారం సాలూరులోని లక్ష్మీథియేటర్ వద్ద ప్రజల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని ఉంచారు. ఆయన పార్థీవదేహాన్ని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, కె.ఎ.నాయుడు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ నాగేశ్వరరావు మరణం సాలూరు పట్టణంలో వైసిపికి తీరని లోటన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు, పలువురు నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. నాగేశ్వరరావు పార్థీవదేహానికి పలువురు రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు అంజలి ఘటించారు.

మరణాలపై బుకాయింపు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'అసలే గిరిజన విద్యార్థుల సంక్షేమంపై అంతులేని నిర్లక్ష్యం. ఆ పై బుకాయింపు... అంతటితో ఆగారా?? ఆ మరణాలను విద్యార్థుల తల్లిదండ్రులపైకి నెట్టేయడం... దీన్నిబట్టి చూస్తుంటే గిరిజనుల సంక్షేమం ప్రభుత్వానికి సంబంధం లేదన్నట్టుగా ఉంది' అంటూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వ్యాఖ్యలపై గిరిజనులు చర్చించుకుంటున్నారు. ఈ పాటి బాధ్యత వహించలేనివారికి మంత్రి పదవి అవసరమా? అని కూడా గిరిజనం రగిలిపోతోంది. కురుపాం ఎపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు తోయక అంజలి సెప్టెంబర్ 26న, తోయక కల్పన ఈనెల 1వ తేదీన తీవ్ర అస్వస్థతతో మృతి చెందిన సంగతి తెలిసిందే. వీరితోపాటు చాలా మంది ఆసుపత్రి పాలయ్యారు. గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో కలుషిత తాగునీరు కారణంగా ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం, వందలాది మంది పచ్చకామెర్లతో ఆస్పత్రుల పాలవ్వడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఆదివాసీ సమాజానికి విద్యా అవకాశాలు కల్పించాలని ఏర్పాటైన ఆశ్రమ పాఠశాలలో ఇటువంటి విషాదకర సంఘటనలు జరగడం పట్ల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంగతి కాస్త అటుంచితే... వరుస మరణాలపై ఎట్టకేలకు స్పందించిన గురుకులాల సంక్షేమ కార్యదర్శి ఎం.గౌతమి ఈనెల 4వ తేదీన వసతి గృహాన్ని సందర్శించారు. 5వ తేదీన కెజిహెచ్‌లో వైద్యసేవలు పొందుతున్న ఇతర విద్యార్థినులను పరామర్శించారు. అప్పటి వరకు అమాత్యులవారికి గుర్తుకు రాలేదు. హడావుడిగా గౌతమితో పాటు కెజిహెచ్‌కు వెళ్లారు. తాగునీరు బాగుందని, వాటర్ ప్లాంట్ బాగానే పనిచేస్తుందని అక్కడ మంత్రి ప్రకటించారు. వాస్తవానికి మంత్రి వసతి గృహానికి వెళ్లకుండానే ఈ ప్రకటనతో బుకాయించారు. ఇందుకు నిరదర్శనం లేకపోలేదు.ఈ ప్రకటనకు ముందు రోజే గురుకులాన్ని సందర్శించిన ఐఎఎస్ ఆఫీసర్ గౌతమి తాగునీటి కలుషితం వల్లే విద్యార్థుల మరణాలు, అనారోగ్యాలకు



కారణమయ్యాయని స్పష్టంగా ప్రకటించారు. అంతే కాదు ఈనెల 7వ తేదీన స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కొత్తవాటర్ ప్లాంట్‌ను కూడా ఓపెన్ చేశారు. మంత్రి బుకాయించారు అనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏముంటుందని గిరిజనుల్లో చర్చనడుస్తోంది. నిజంగా మంత్రి చెప్పింది వాస్తవమైతే ఎమ్మెల్యేగారు కొత్తప్లాంట్ ఓపెన్ చేయాల్సిన అవసరం ఏముంది. అంటే ఎమ్మెల్యే ఊరకే ప్రజల్లో మెప్పుకోసం హడావుడి చేశారా? పోనీ దానిపైనైనా మంత్రి స్పందించారా అంటే అదీ లేదు. అంతెందుకు రెండు విద్యాకుసుమాలు రాలిపోయిన ఆ కురుపాం గురుకులాన్ని మంత్రి ఇప్పటికీ సందర్శించలేదు. చివరకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అచ్చన్నాయుడికి ఉన్నంత శ్రద్ధ కూడా లేకపోయిందా? అంటూ గిరిజనుల నోట వినిపిస్తోంది. జిల్లా తరపున మంత్రి పదవి చేపట్టి, అందులోనూ గిరిజన సంక్షేమశాఖ బాధ్యతలో ఉండి, ఇంత నిర్లక్ష్యం ప్రదర్శించడమే కాకుండా, దసరా సెలవులకు ఇళ్లకు వెళ్లడం వల్ల అక్కడే అనారోగ్యాలకు గురైనట్టు చెప్పడం ఎంత వరకు సమంజసమని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. గిరిజన వసతి గృహాలకే బాధ్యత వహిస్తారా? ఇళ్ల వద్ద అనారోగ్యానికి గురైతే మంత్రికి బాధ్యత లేదా? అని జనం మాట. వాస్తవానికి మంత్రి గడిచిన రెండు లేదా ముడు నెలల్లో ఒక్క సంక్షేమ వసతి గృహాన్నైనా సందర్శిచారా అంటే గిరిజన సంక్షేమ శాఖ అధికారులు నీళ్ల నములుతున్నారు. మరి మంత్రిగారికే తీరికలేకపోతే పర్యవేక్షణ ఎలా ఉంటుంది. మొత్తం వ్యవహారానికి బాధ్యత వహించాల్సిన మంత్రి తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపాన్ని వార్డెన్లు, వైద్య సిబ్బందిపైకి నెట్టేస్తున్నారనే వాదన కూడా ఉంది. స్థానిక ఎమ్మెల్యే లేక మంత్రి వసతి గృహాల్లో పర్యవేక్షణ చేస్తే సిబ్బంది అప్రమత్తం అయ్యేవారు. కురుపాం గిరిజన గురుకులంలోని వాటర్ ప్లాంట్ సమస్య వెలుగులోకి వచ్చేది. ఆ ముక్కుపచ్చలారని ఆ ఇద్దరు చిన్నారులూ ప్రాణాలతో ఉండేవారు. అటువంటి శ్రద్ధ చూపకుండా మొత్తం వ్యవహారానికి బాధ్యులను చేస్తూ స్థానిక వార్డెన్, ఎఎన్ఎంలను సస్పెండ్ చేయమంటే చేను చెల్లుపోయాక కళ్లం కాపు కాసినట్టేని పబ్లిక్ టాక్.

ప్రజాశక్తి
www.prajasakti.com


వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

పిహెచ్‌సిలో నర్సులే వైద్యులు

ప్రజాశక్తి-వీరఘట్టం

తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఈ నెల మూడో తేదీ నుంచి పిహెచ్‌సిల వైద్యులు సమ్మెబాట పట్టిన విషయం తెలిసిందే. ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడం లేదు. ఈ నేపథ్యంలో పిహెచ్‌సిలో రోగులకు నర్సులే వైద్యం చేస్తున్నారు. వీరఘట్టం పిహెచ్‌సికి నిత్యం 100 నుండి 200 వరకు ఒపి ఉంటుంది. వైద్యులు లేకపోవడంతో రోగులు ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని రిమ్స్ ఆసుపత్రి నుండి శిక్షణ పొందిన వైద్యులు వచ్చి రోగులకు పరీక్షలు చేసి, సాయంత్రం నాలుగు గంటలు దాటిన తర్వాత వెనుదిరుగుతున్నారు. అనంతరం వచ్చిన రోగులకు నర్సులే వైద్యం అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో పాలకొండ, పార్వతీపురం పట్టణాలకు రిఫర్ చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వైద్యుల డిమాండ్లు నెరవేర్చి, పిహెచ్‌సిల్లో అందుబాటులో ఉంచేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

వినతుల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రజాదర్బార్‌లో వస్తున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించేటట్లు కృషి చేస్తానని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి 5 మండలాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి తమ సమస్యలపై అర్జీలిచ్చారు. భూ సమస్యలు పరిష్కరించాలని, వికలాంగ పింఛన్లు మంజూరు చేయాలని, రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతులు ఇచ్చారు.


పింఛను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కు వినతి ఇస్తున్న వికలాంగుడు

డిడిగా కృష్ణవేణిని కొనసాగించాలి

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన సంక్షేమ శాఖ మన్యం జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా ఆర్.కృష్ణవేణిని కొనసాగించాలని ఆదివాసీ సేవా సొసైటీ అధ్యక్షులు ఎం.రవికుమార్, సభ్యులు ఎం.సూరిబాబు, బాబూరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డిడి బాధ్యతల నుంచి కృష్ణవేణిని తప్పించడం ఆదివాసీలను అవమాన పరచడమేనని అభిప్రాయ పడ్డారు.


ఉప సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఉప సర్పంచ్ పాలవలస బృందావతి మావయ్య పాలవలస ఆదినారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో శనివారం ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే వి.కళావతి పరామర్శించారు కార్యక్రమంలో పాలవలస ప్రకాశరావు, సర్పంచ్ కళావతి పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జాతీయ తపాలా వారోత్సవాలలో భాగంగా రెండు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎస్.కోట పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఎస్‌పిఎం హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 13,14 తేదీల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పర్యావరణం పట్ల విద్యుత్ శాఖ నిర్లక్ష్యం తగదని పర్యావరణవేత్త, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వినాయకపల్లి గ్రామ ఆర్ అండ్ బి పరిధిలోని విద్యుత్ శాఖ సిబ్బంది విచక్షణారహితంగా చెట్లను నరికి వేయడం పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ తీగలకు అడ్డు వస్తే కొమ్మలు తొలగించాలే కాని చెట్టును మొదలు వరకూ పూర్తిగా నరికివేయడం పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి కూడా కుటుంబాలు ఉంటాయని వారికి కూడా ఆక్సిజన్ అవసరమేననే విషయం మరువకూడదన్నారు. పర్యావరణం పట్ల విద్యుత్ శాఖ నిర్లక్ష్యం తగదన్నారు.

కొత్త గురువులకు సన్మానం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో చదువుకొని ఇటీవల నిర్వహించిన డిఎస్‌సికి సెలెక్ట్ అయిన బొడ్డేటి సంతోష్ కుమార్, స్కూల్ అసిస్టెంట్ పల్లె శ్రావణి సెకండ్ గ్రేట్ టీచర్‌లను స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేతుల మీదుగా శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి రైతు మృతి

ప్రజాశక్తి- రేగిడి

మండలం నాయిరాలవలస పంచాయతీ పరిధి రెడ్డి పేట గ్రామంలో శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ఒక్కసారిగా పిడుగు పడి కోవగాన నాయుడు (45) అనే రైతు మృతి చెందారు. గత రెండు రోజులుగా గ్రామ సమీపంలో మొక్కజొన్న పిక్కలు ఆరేశారు. శనివారం వర్షం పడడంతో మొక్కజొన్న పిక్కలపై టార్పాలిన్ కప్పుతుండగా ఒక్కసారిగా పిడుగుపడి నాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. భార్య సుగుణ స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. మృతదేహాన్ని పంచనామా చేసి రాజాం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడు ఖాళీ సమయంలో ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతునికి భార్య సుగుణతో పాటు ఇద్దరూ కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

బరితెగించేశారు!

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే బెల్ట్ తీస్తానని ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన హెచ్చరికలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. తాగునీరు దొరకని గ్రామమైనా ఉందేమో గానీ మద్యం దొరకని ప్రాంతం లేదంటే అతిశయోక్తి కాదు. అంతగా ఎక్కడికక్కడ బెల్టుషాపులు వెలిశాయి. బెల్ట్ షాపులకు నిర్వహణకు అడ్డుకట్ట వేయాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు బరితెగించి.. అదే గొలుసు దుకాణాలకు మద్యం డోర్ డెలివరీ చేస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అందుకోసం దండిగానే మామూళ్లు వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

- బెల్ట్‌షాపులకు మద్యం డోర్ డెలివరీ
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ?
- తూతూ మంత్రంగానే తనిఖీలు


బెల్ట్ షాపుల నిర్వాహకులతో ఎక్సైజ్ అధికారులు(ఫైల్)

ప్రజాశక్తి-కొమరాడ

పార్వతీపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం షాపుల్లో అక్రమాలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఎక్సైజ్ అధికారుల కన్నుసన్నల్లో జరుగుతున్న అక్రమాలు బయటకు పొక్కకుండా ఒక్కో షాపు నుంచి ఆయా శాఖల అధికారులు నెలవారీ మామూళ్లు దండుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్వతీపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కొమరాడ మండలంలో విక్రమపురం, కొమరాడ, పార్వతీపురం పట్టణ, పరిసర ప్రాంతాల్లో మద్యం షాపులున్నాయి. వీటికి అనుబంధంగా కొమరాడ మండలాల్లో 31 పంచాయతీల్లో 160కి పైగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. గ్రామాల్లో వీధికి ఒకటి రెండు చొప్పున బెల్ట్‌షాపులు ఏర్పాటుచేశారు. సాధారణ తనిఖీల పేరుతో ఏకంగా ఎక్సైజ్ శాఖకు సంబంధించిన వాహనాల్లో సిబ్బంది బెల్ట్ షాపులకు మద్యం డోర్ డెలివరీ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకు గాను ఒక్కో బెల్ట్‌షాపు నుంచి ఎక్సైజ్ అధికారులకు నెలకు రూ.5 వేల నుంచి 10 వేలు చొప్పున మామూళ్లు అందుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. బెల్టుషాపుల ద్వారా ఎక్సైజ్ అధికారులకు నెలవారీ రూ.10 లక్షలకు పైగా మామూళ్లు అందుతున్నట్లు తెలిసింది.

నెలవారీ మామూళ్లు ఇస్తే రాత్రీ పగలూ తేడా లేకుండా ఏ సమయంలోనైనా మద్యం అమ్ముకునే వెసులుబాటు కల్పించినట్లు మహిళలు చెబుతున్నారు. మామూళ్లు ఇవ్వడం కాస్త ఆలస్యమైతే దాడులు చేయటమే కాకుండా కేసుల పేరుతో వేలాది రూపాయలు దండుకుంటున్నారని గతంలో వివిధ కేసుల్లో పట్టుబడిన బెల్టు షాపుల నిర్వాహకులు చెబుతున్నారు. అప్పుడప్పుడు ఉన్నతాధికారులు బెల్ట్‌షాపుల తనిఖీలకు వచ్చే ముందు స్థానిక ఎక్సైజ్‌స్టేషన్లో పని చేస్తున్న సిబ్బంది ముందుగా నిర్వాహకులకు సమాచారం అందిస్తున్నట్లు తెలిసింది. ఆ సమయంలో బెల్ట్‌దుకాణాల్లో మద్యం నిల్వలు లేకుండా జాగ్రత్త పడేందుకు సమాచారాన్ని లీక్ చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇదే అదునుగా తనిఖీల తర్వాత ఉన్నతాధికారులకు మామూళ్లు పంపాలని చెప్పి అదనంగా వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బెల్టు షాపులకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

వసతిగృహాన్ని సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలోని గిరిజన సంక్షేమ పోస్ట్ మెట్రిక్ బాలుర వసతిగృహాన్ని ఎంఇఒ ఎన్.సత్యనారాయణ శనివారం అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వంటగది, స్టాకు నిల్వ, వసతి గృహ పరిసర ప్రాంతాలను, మరుగుదొడ్లను, విద్యార్థుల గదులను, తాగునీటిని క్షుణంగా పరిశీలించారు. అనంతరం వార్డెన్ సిహెచ్ సాంబమూర్తితో మాట్లాడి, విద్యార్థులకు ఇంకా మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి, పారిశుధ్య లోపం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కురుపాం

మండలంలోని మొండెంఖల్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన బి. నిఖిత, బి. జాహ్నవిక, పవిత్ర, రాహుల్ తోపాటు పలువురు విద్యార్థులు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పిఇటి బి.మన్మథరావు, డి.జయకుమార్ తెలిపారు. ఇటీవల నర్సీపురంలో జరిగిన డివిజన్ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి, జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

పాఠశాల భవనం నిర్మించాలని నిరసన


నిరసన తెలుపుతున్న సర్పంచ్ రామయ్య, సిఐటియు నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి-పాచిపెంట

గిరిజన గ్రామం అల్లంపాడులో పాఠశాల భవనం నిర్మించాలని మెలియాకుంచూరు సర్పంచ్ కోటపర్తి రామయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామయ్య మాట్లాడుతూ అల్లంపాడు గ్రామంలో పాఠశాల భవనం లేకపోవడంతో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు కష్టాలు పడుతున్నారని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ అల్లంపాడుతో పాటు తుమర వల్లి, నేరడవలస, కమ్మరిజోల, కరకవలస, కొండలుద్దండి, బొడ్డపాడు గ్రామాల్లో నేటికీ పాఠశాల భవనాలు లేక ప్రజల సహకారంతో రేకులషెడ్లు, చెట్లు కింద, ఎక్కడో ఇంటి ముందర చదువు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గిరిజన విద్యార్థుల పట్ల పాలకులు నిర్లక్ష్యం మానుకొని, వెంటనే పాఠశాల భవనం నిర్మించాలని డిమాండ్‌చేశారు. వీరికి కేరంగి సర్పంచ్ సోముల లచ్చయ్య మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కోటపర్తి లచ్చయ్య, డప్పు సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి, నాయకులు

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ దారుణం

మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం దారుణమని మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్పశ్రీవాణి అన్నారు. జియ్యమ్మవలస మండలం చినమేరంగి క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ... చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 40 రోజులపాటు సంతకాల సేకరణ చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని

13న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ పిలుపు


విద్యార్థులతో కలిసి ధర్నా పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-కురుపాం

మరణించిన గురుకుల పాఠశాల విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ నెల 13న కురుపాం తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బి.అనిల్ కోరారు. శనివారం పోస్టుమెట్రిక్ బాలికల వసతిగృహ విద్యార్థులతో కలిసి ధర్నా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో 170 మంది విద్యార్థులు అనారోగ్యం బారిన పడి, ఇద్దరు విద్యార్థులు మరణించినా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోలేదన్నారు. నష్ట పరిహారం ప్రకటించకపోవడం దారుణమన్నారు. గిరిజన విద్యార్థుల ప్రాణాలంటే పాలకులకు అంత చులకనా? అని నిలదీశారు. మరణించిన విద్యార్థులు తోయక అంజలి, తోయక కల్పన కుటుంబాలకు రూ.50 లక్షలు నష్టపరిహారం ఇచ్చి, ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యంతో పాటు 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలన్నారు. ఎఎన్‌ఎంలను నియమిస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి.. మంత్రి చేసిన మొదటి సంతకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎ.గంగారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

పట్టణ పౌర సంక్షేమ సంఘం డిమాండ్

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని ఆరో వార్డు పరిధిలోని అగురువీధిలో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి ఎన్‌వై నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శనివారం పట్టణంలోని ఆరోవార్డులో పిపిఎస్‌ఎస్ నాయకులు పర్యటించారు. అగురువీధిలో సమస్యలను స్థానికులు.. నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, మురుగునీటి కాలువలు సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మెంటాడ వీధి కాలువలో పూడిక తీయకపోవడంతో నీరు దిగువకు వెళ్లకుండా, కాలనీ నివాసాలపైకి వస్తుందన్నారు. వారం రోజులకు పైగా ఇళ్ల మధ్య నీరు నిలువ ఉండిపోతోందని, పాములు, కీటకాలు ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో కాలనీ వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.వెంకట్రావు ,లలిత పాల్గొన్నారు.


మురుగునీటిని పరిశీలిస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

పార్కు సుందరీకరణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-గరుగుబిల్లి

తోటపల్లి పార్కు సుందరీకరణ పనులను జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి పర్యవేక్షించారు. గరుగుబిల్లి మండలం తోటపల్లి బ్యారేజ్ వద్దనున్న ఐటిడిఎ పార్కు పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి జెసి శనివారం పరిశీలించారు. పార్కు పనులు మరింత వేగవంతం కావాలని అధికారులను ఆదేశించారు. పిల్లలు ఆడుకునే ఆట పరికరాల సామగ్రిని స్వయంగా పరిశీలించారు. పార్కు ఆహ్లాదకరంగా, సుందరంగా కనిపించేలా అభివృద్ధి పనులను చేపట్టాలని, జంగిల్ క్లియరెన్స్ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్తీకమాసం నాటికి పార్కు పనులు పూర్తి చేసి సిద్ధం చేయాలని సూచించారు. ఈ పర్యటనలో తోటపల్లి ప్రాజెక్టు కార్యనిర్వాహక ఇంజినీరు తిరుపతిరావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జెసి యశ్వంత్‌కుమార్

మద్యం దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాలను శనివారం ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధన ప్రకారం మద్యం షాపులు నడుపుతూ నాణ్యమైన మద్యాన్ని అమ్ముతున్నారో, లేదో పరిశీలించి, నమూనాలు సేకరించి, విశాఖపట్టణం రీజనల్ లేబోరేటరీకి పంపిస్తామన్నారు. గతంలో పంపించిన నమూనాలన్నీ కూడా నాణ్యమైన మద్యం ఉన్నట్లు ధృవీకరించారని తెలిపారు. మద్యం నాణ్యతకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులున్నా 63029 36599 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం


సీతానగరం.. ర్యాలీ చేపడుతున్న ఉపాధ్యాయులు, అంగన్వాడీలు, విద్యార్థులు


ప్రజాశక్తి-సీతానగరం

జిల్లాలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సదస్సు ఏర్పాటుచేశారు. ఇటీవల నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఇదే పాఠశాలలో చదివి ఇస్రో శాస్త్రవేత్తగా ఎంపికైన ప్రదీప్‌నాయుడును సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసన్న లక్ష్మి, ఉపాధ్యాయులు గుల్ల లక్ష్మి, సుభద్ర, అంగన్వాడీ కార్యకర్తలు సునీత, మేరీ, రమాదేవి, రామలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.


బలిజిపేట : వంతరాం కెజిబివిలో బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యాసరచన, డిబేట్, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బముమతులు అందజేశారు. కార్యక్రమంలో వంతరాం సర్పంచ్ బేవర బాల సన్యాసిరావు, సిడిపిఒ కె.రాజ్యలక్ష్మి, ఎంఇఒ ఎస్.సింహాచలం, ఐసిడిఎస్ సూపర్వైజర్ బి.పద్మావతి, టాటా ట్రస్ట్ అసోసియేట్ జగన్మోహన్రావు, జిల్లా బాలికల సంరక్షణ విభాగం సభ్యులు ఎం.ఎ.నాయుడు, ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలో ఏగులువాడ గ్రామంలో సర్పంచ్ పి.అలివేలు ఆధ్వర్యంలో శనివారం ఆర్ట్ సంస్థ సహకారంతో బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ట్ సంస్థ కోఆర్డినేటర్లు సూర్యం, చిరంజీవి, సౌజన్య, రాధమ్మ, అంగన్వాడి కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నలిని పాల్గొన్నారు.

భామిని : భామిని కెజిబివిలో సిడిపిఒ శాంతి భవాని ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కలిగించారు.


కురుపాం.. వేడుకల్లో పాల్గొన్న ఆర్ట్ సంస్థ ప్రతినిధులు, అంగన్వాడీలు

అనంతరం పోక్సో చట్టం, చైల్డ్ రైట్స్‌పై డిబేట్, వ్యాసరచన పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ భాస్కర్ రావు, సర్పంచ్ లోపింటి రాజేష్, స్కూల్ చైర్మన్ నాయుడు, కెజిబివి ప్రిన్సిపల్, ఐసిడిఎస్ సిబ్బంది ఉన్నారు.



బలిజిపేట, భామినిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

పురుగుల మందు తాగి

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని పెదం కలాం గ్రామానికి చెందిన చింతాడ సంధ్య (25) పురుగుల మందు తాగి మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. చింతాడ సంధ్య పెదబోగిలి-1 సచివాలయ పరిధిలో వెల్‌నెస్ సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌ఒగా పనిచేస్తోంది. ఇటీవల తన కుటుంబం పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడం, తనకు పెళ్లి పట్ల వ్యతిరేకత ఉండడంతో మనస్తాపానికి గురై ఈ నెల ఏడో తేదీన సీతానగరం రైల్వే స్టేషన్ వద్ద పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను స్నేహితులు, బంధువులు పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని ప్రయివేటు ఆసుపత్రి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం ఆమె మృతి చెందింది. సంధ్య తల్లి చింతాడ మరియమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎం.రాజేష్ కేసు నమోదు చేశారు.


చింతాడ సంధ్య (ఫైల్)